

అదనపు భవనాలను నిర్మించాలని వినతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయడం కూటమి ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శాసనసభలో సర్వ శిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వజ్రపుకొత్తూరు మండలంలోని అనంతగిరి, మందస మండలంలోని డిమిరియా పాఠశాలల్లో అదనపు భవనాలను నిర్మించాలని వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన శ్రీనివాస్ ఈ అంశమై తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

వస్తున్నారు... వెళ్తున్నారు

- ఏడాది గడిచినా ఒక్క పరిశ్రమ తీసుకురాలేని పరిస్థితి
- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేని బాబాయ్, అబ్బాయ్
- మెతక వైఖరితో నెల్లూరుకు తరలిన బిపిసిఎల్ రిఫైనరీ
- మేలు చేయకపోగా ఉద్దానంలో ఎయిర్‌పోర్టు చిచ్చు

గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాల్లో జిల్లాకు చెందిన నేతలకు చోటు దక్కింది. అదీ ఒకే ఇంటి నుంచి ఇద్దరికి పదవులు వరించాయి రాష్ట్ర కేబినెట్‌లో అచ్చెన్నాయుడుకి వ్యవసాయశాఖ, రామ్మోహన్‌నాయుడుకి కేంద్ర కేబినెట్‌లో పౌర విమానయానశాఖ మంత్రి పదవులు వరించాయి. వారి రాజకీయ అనుభవం, పలుకుబడితో ప్రజలకు మేలు చేసే ఏవైనా ఒకట్రెండు పరిశ్రమలు, ప్రాజెక్టులు తీసుకొస్తారని అంతా భావించారు. మొదట్లో బిపిసిఎల్ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టు వస్తుందని పలు సమావేశాల్లో ఇరువురూ చెప్పుకొచ్చినా అది కాస్తా చేజారి నెల్లూరుకు తరలింది. మరో ప్రాజెక్టు ఏదైనా తీసుకురాకపోతారా అని ఆశించిన ప్రజలకు షాక్ ఇస్తూ ఉద్దానం ప్రాంతంలోని పచ్చని పంట పొలాల్లో చిచ్చు పెట్టేలా మందస ఎయిర్ పోర్టు బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నించడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలు సందర్భాల్లో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాకు భారత పెట్రోలియం కార్పొరేషన్ కంపెనీ లిమిటెడ్ (బిపిసిఎల్) ఆయిల్ రిఫైనరీ వస్తుందని కొద్ది నెలలు పాటు ప్రజలను ఊరించారు. అందుకనుగుణంగా సంతబొమ్మాళి మండలం మూలపేటలో ఒకేచోట రిఫైనరీ ఏర్పాటు అవసరమైన భూమి కూడా ఉందని చెప్పుకొచ్చారు. ప్రాజెక్టు వస్తే లక్ష కోట్ల రూపాయలపైన పెట్టుబడులు, వేల ఉద్యోగాలు వస్తాయని పలు సమావేశాల్లో ఆశలు కల్పించారు. తీరా చూస్తే అది కాస్తా నెల్లూరు జిల్లాకు రామాయపట్నం ప్రాంతానికి తరలిపోయింది. రిఫైనరీ తరలిపోవడం వెనుక రాజకీయ కారణాలు దాగున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో అది ఏర్పాటయితే తన వ్యాపార ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని ఒడిశా అడ్డుచెప్పడంతో అది ఇక్కడ నుంచి తరలిపోయినట్లు ప్రచారం సాగుతోంది. ఒడిశా రాష్ట్రం పారాదీప్‌లో ఇప్పటికే ఇండియన్ ఆయిల్ రిఫైనరీ కార్పొరేషన్ లిమిటెడ్ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తోంది. అక్కడకు సుమారు 450 కి.మీ దూరంలో ఉన్న మూలపేటలో ఏర్పాటు చేస్తే ఐఒసిఎల్ వ్యాపార ప్రయోజనాలకు ఇబ్బంది వస్తుందని ఒడిశా అభ్యంతరం చెప్పడంతో దానికి ఆదిలోనే బ్రేక్ పడింది. మంత్రుల మెతక వైఖరి వల్లే అది తరలిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెనుకబడిన జిల్లా అంటూ శ్రీకాకుళంపై మాటల్లో ప్రేమ కురిపించే పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర ప్రభుత్వ పెద్దలను ఒప్పించే విషయంలో చిత్తశుద్ధిని ప్రదర్శించి ఉంటే జిల్లాలోనే అది ఏర్పాటై ఉండేదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

రిఫైనరీ రప్పించలేక ఫీజుబులిటీ లేదనే ప్రచారం

బిపిసిఎల్ రిఫైనరీ తరలిపోలేదని, ఫీజుబులిటీ లేకే జిల్లాలో ఏర్పాటు కాలేదని కేంద్రమంత్రి పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఇటీవల మీడియా సమావేశంలో చెప్పుకొచ్చారు. రిఫైనరీ ఏర్పాటు కోసం రాష్ట్రంలో మూడు ప్రాంతాలను బిపిసిఎల్ ప్రతినిధులు పరిశీలించారని, జిల్లాలో అనువుగా లేకపోవడంతో వేరే చోటుకు వెళ్లిపోయిందన్నారు. ఎపికి ఉత్తర ప్రాంతం కంటే దక్షిణ వైపు అనువుగా ఉంటుందనే నెల్లూరులో ఏర్పాటు చేశారంటూ వివరణ ఇచ్చారు. జిల్లాలో మందస ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి, సరుబుజ్జిలిల్లో థర్మల్ ప్లాంట్‌కు ఉన్న ఫీజుబులిటీ బిపిసిఎల్ రిఫైనరీకి లేకపోవడటమేమిటని ప్రజలు అనుకుంటున్నారు.

ఉద్దానం ప్రాంతంలో ఎయిర్‌పోర్టు చిచ్చు

జిల్లా ప్రజలకు మేలు చేయకపోగా ఇరువురు మంత్రులు ఉద్దానం ప్రాంతంలోని పచ్చని పంట పొలాల్లో ఎయిర్ పోర్టు చిచ్చు రగిలించార్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని 16 గ్రామాల పరిధిలోని మొత్తం 1383.25 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం ప్రభుత్వం భూసేకరణకు సన్నాహాలు చేస్తోంది. దీనిపై ప్రభావిత గ్రామాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. భూసార పరీక్షల కోసం వెళ్లిన సిబ్బంది స్థానికులు రెండు పర్యాయాలు అడ్డుకున్నారు. ప్రభుత్వం ఎయిర్ పోర్టు ప్రయత్నాలు సాగిస్తున్నా, ఇరువురు మంత్రుల్లో ఒక్కరూ గ్రామాలను సందర్శించడం గాని, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం గాని చేయడం లేదు. ఎయిర్ పోర్టు వస్తే అభివృద్ధి జరిగిపోతుందని, ఉద్యోగాలు వస్తాయంటూ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఎయిర్‌పోర్టుతో ఎకానమీ ముడిపడి ఉందంటూ కేంద్రమంత్రి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. మందస ఎయిర్ పోర్టుకు, తెలంగాణలోని శంషాదాబాద్ ఎయిర్‌పోర్టుకు పోలికి తెచ్చి బ్రహ్మండమైన అభివృద్ధి జరిగిపోతుందంటూ చెప్పుకొస్తున్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్న కార్గో ఎయిర్‌పోర్టుతో సరుకు రవాణా, కొందరు బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లు రాకపోకలు సాగించడానికి తప్ప ఇందులో తమకు ఒరిగిదేమీ లేదన్న అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

మాట్లాడుతున్న అల్లు మహాలక్ష్మి

వంట కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహాలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మధ్యాహ్న భోజన పథకం మెనూ ఛార్జీలు పెంచాలని, వంట కార్మికులకు రూ.10 వేలు కనీస వేతనం ఇవ్వాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి డిమాండ్ చేశారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా 6వ మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని అన్నారు. ప్రతినెలా 5లోపు వేతనాలు చెల్లించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్యను పెంచడానికి పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలనే మంచి లక్ష్యాలతో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుందని అన్నారు. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యాలకు విరుద్ధంగా నీరుగారుస్తున్నాయని అన్నారు. 20 ఏళ్లగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైమరీ విద్యార్థులకు రూ.6.19 పైసలు, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్ కళాశాల విద్యార్థులకు రూ.9.26 పైసలతో నాణ్యమైన, పౌష్టికాహారం భోజనం ఎలా పెట్టాలని ప్రభుత్వానికి ప్రశ్నించారు. రాగిజావ తయారు చేయడానికి గ్యాస్ ఖర్చు వర్కర్లపైనే భారం పడుతుంది. ధరలు పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు.

మహాసభ ప్రారంభానికి ముందు జెండాను మహాలక్ష్మి ఆవిష్కరించారు. మహాసభలో నివేదిక ప్రవేశపెట్టగా ప్రతినిధులంతా చర్చించారు. రాబోయే కాలంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టాలని తీర్మానించారు. ఈ మహాసభలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయుకులు చందు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఈ మహాసభలో 10 మంది ఆఫీసు బేరర్స్, 30 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎపి మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులుగా అల్లు మహాలక్ష్మి, అధ్యక్షులుగా కె.సుశీల, ప్రధాన కార్యదర్శిగా బి.ఉత్తర, కోశాధికారిగా ఆర్.రాధ, ఉపాధ్యక్షులుగా టి.సీతమ్మ, వి.లక్ష్మి, కె.కౌసల్య, కార్యదర్శులుగా టి.ప్రవీణ, పి.భూదేవి, వై.లక్ష్మిలను ఎన్నుకున్నారు.

మహాలక్ష్మి

సుశీల

ఉత్తర

ఘనంగా కొత్తమ్మతల్లి శోభాయాత్ర

డప్పు కొట్టి ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కొత్తమ్మ తల్లి శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన శోభాయాత్ర యాత్రికులకు కనువిందు కలిగింది. కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు నుంచి కోటబొమ్మాళి వరకు అంగరంగ వైభవంగా బుధవారం శోభాయాత్ర సాగింది. కళాకారుల నృత్యాలు, గ్రామీణ సాంస్కృతిక కళలు అందరినీ అలరించాయి. శోభయాత్రను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వ్యవసాయ శాఖ మంత్రి సతీమణి కింజరాపు విజయ మాధవి, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ విజయ ఢంకా మోగించారు. పచ్చ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. సూర్యరథం, సింహాచలం రథం, అన్నవరం రథం యాత్ర నాదస్వరం, డోలు, మంగళ వాయిద్యాలతో కాశయాత్ర, కోలాటం, దాండియా, పెద్దపాడు డప్పులు, థింసా డాన్స్, జముకుల పాట, కొమ్ము డాన్స్, ఒడిశా డప్పు డాన్సు, కేరళ డ్రమ్స్, చెక్కభజన, పులి వేషాలు, కర్ర సాము, మహిళల డబ్బు డాన్స్, పెద్ద బొమ్మల డాన్స్, గుర్రాల డాన్స్, పురుషుల డప్పు డాన్సు, కాళీమాత డాన్స్, బిందిల డాన్స్, లేడీస్ తీన్మార్ వంటి సాంస్కృతిక, గ్రామీణ కళల నడుమ శోభాయాత్ర భక్తులకు పనుల పండగగా అలరించింది. భక్త జనులు శోభాయాత్రలో కేరింతలతో ఉల్లాసంగాల్లోని భక్తిపారవస్యంలో ఆనంద అనుభూతిని పొందారు. అనంతరం జిల్లా కలెక్టర్ సతీసమేతంగా కొత్తమ్మ తల్లిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ కె.గోవిందరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ వెలమల విజయలక్ష్మి, అధికారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

దసరా పండుగ సందర్భంగా దూర ప్రాంతాల నుంచి సొంత ఊర్లకు వచ్చి, వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఎపిఎస్ఆర్‌టిసి శ్రీకాకుళం జిల్లా పరిధిలోని నాలుగు డిపోల నుంచి ఈ నెల 29 నుంచి అక్టోబరు 5 వరకు 480 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అదనపు ఛార్జీలు తీసుకోకుండా కేవలం సాధారణ ఛార్జీలతోనే ఈ బస్సులు నడుపుతామని చెప్పారు. విశాఖపట్నం పలాస, సోంపేట, పాతపట్నం, కొత్తూరు, రాజమండ్రి కాకినాడ రూట్లలో, దసరా తరువాత, తిరుగు ప్రయాణికుల సౌకర్యార్థం జిల్లా నుంచి హైదరాబాద్, విజయవాడ, అమలాపురం, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. విజయవాడ వెళ్లే భవానీ యాత్రికులకు ప్రత్యేక బస్సులు కోరిన విధంగా ప్యాకేజీ బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

డిఎంహెచ్ఒ అనిత

లావేరు : ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత అన్నారు. డాక్టర్ రెడ్డీస్ వారి ఆర్థిక సహకారంతో ఆధునికరించిన లావేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఎక్సర్ట్ ఐ.ఆర్ ఆంధ్ర క్లస్టర్ పిఒ పార్టనర్ సిటిఒ బి.రమణ, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డైరెక్టర్, హెల్త్ సత్తి శ్రీనివాస్ కలిసి పున్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించాలనే ఉద్దేశంతో మారుమూలలలో ఉన్న పిహెచ్‌సిలను సుందరీకరణ చేసి, అన్ని ఆధునిక సౌకర్యాలతో, డాక్టర్ రెడ్డీస్ అభివృద్ధి చేసిందన్నారు. లేబొరేటరీలను అత్యాధునిక సదుపాయలు కల్పించారని అన్నారు. ఉచితంగా రక్త పరీక్షలు, ప్రసవాలు చేస్తారని తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఇదే స్థాయిలో ఆధునికీరించామని, మరొక 7 పిహెచ్‌సిల పనులు నవీనికరణకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అలానే నర్సింగ్ స్టాఫ్‌కి ప్రసవాలు నిర్వహించడానికి, అత్యవసర చికిత్సలు అందించడానికి కావలసిన నైపుణ్య శిక్షణను అందిచామని అన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ మౌనిక, మణిభూషణ్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది సురేష్, నవీన్ పాల్గొన్నారు.

పిహెచ్‌సి పరిశీలన

శ్రీకాకుళం సిటీ : వైద్య సేవలు మెరుగ్గా ఉండాలని డిఎంహెచ్ఒ కె.అనిత ఆదేశించారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. వైద్య సేవలు, హాజరవుతున్న రోగులు వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య శిబిరాలు గ్రామాల్లో నిర్వహించాలని చెప్పారు. ఆరోగ్య పరీక్షలు పక్కాగా నిర్వాహణకు చర్యలు తీసికోవాలన్నారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతు న్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ లిల్లీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు :ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ అనిత

వాహనాలను సీజ్ చేస్తున్న అధికారులు

అక్రమ ఇసుక ర్యాంపులపై దాడులు

17 వాహనాలు సీజ్

ప్రజాశక్తి- పొందూరు

కొంతకాలంగా యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై అధికారులు కన్నెర్ర చేశారు. రహదారి పక్కనే అక్రమంగా ర్యాంపులు ఏర్పాటు చేసి భారీగా ఇసుకను నిల్వ చేసి వాహనాలతో తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ ఆధ్వర్యాన నాగావళి నది సమీప గ్రామాల్లో నిర్వహిస్తున్న అనాధికార ఇసుక ర్యాంపులపై జిల్లా అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. మండలంలోని కింతలి, బొడ్డేపల్లి రహదారిలో ఇరువైపుల భారీగా ఉన్న ఇసుక నిల్వలపై రెవెన్యూ, పోలీస్, మైనింగ్, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. అక్కడ ఉన్న వాహనాలను పట్టుకొని సీజ్ చేశారు. మండలంలోని సింగూరు, నెల్లిమెట్ట, బొడ్డేపల్లి గ్రామాలకు చెందిన పలువురు ఈ అక్రమ ఇసుక ర్యాంపులను నిర్వహిస్తున్నట్లుగా సమాచారం. ఇదే సమయంలో ఇసుకలోడుతో ఉన్న మూడు బారీ ట్రిపుర్లను, పది ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఇసుక నిల్వల వద్ద ఇసుకను లారీల్లో, ట్రాక్టర్లలో నిల్వ చేస్తున్న నాలుగు ప్రొక్లెయినర్లను స్వాధీనం చేసుకున్నారు. ర్యాంపు నిర్వాహకుల గురించి వాహన డ్రైవర్లను ప్రశ్నించారు. తాము కేవలం ఇసుకను మాత్రమే తీసుకెళు న్నామని లావీదేవీలన్నీ తమ వాహన యజమాని చూస్తారని డ్రైవర్లు చెప్పారు. నిల్వల వద్ద ర్యాంపుల్లో లోడుల సమాచారంతో ఉన్న రికార్డులను జెసి స్వాధీనం చేసుకుని అధికారులకు అప్పగించారు. ఈ దాడుల్లో ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిఎస్‌సి వివేకానంద, మైనింగ్ డిడి మోహనరావు, ఎడి విజయలక్ష్మి, పొందూరు తహశీల్దార్ ఆర్.వెంకటేష్, ఎస్ఐ బాలరాజు పాల్గొన్నారు. ర్యాంపులు, నిల్వలపైనా, నిర్వాహకులపైనా కేసులు నమోదు చేసి వాహనాలను స్టేషన్‌ను తరలించారు.

అక్రమ ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న అధికారులు

నూతన ఉపాధ్యాయులు పయనం

నూతన ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

డిఎస్‌సికి ఎంపికైన నూతన ఉపాధ్యాయులు బుధవారం అమరావతి పయనమయ్యారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదగా నియామక ధ్రువీకరణ పత్రాలు గురువారం స్వీకరించనున్నారు. ఈ నెల 19న నిర్వహించాల్సిన ఈ కార్యక్రమం వర్షాలు కారణంగా వాయిదా పడింది. దీంతో గురువారం నిర్వహించనున్నారు. జిల్లాకు సంబంధించి మొత్తం 675 మంది అన్ని కేటగిరిలో ఎంపికయ్యారు. శ్రీకాకుళం పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో బస్సులు అందుబాటులో ఉంచారు. మొత్తం 37 బస్సుల్లో నూతన ఉపాధ్యాయులు, వీరికి తోడుగా మరొకరు, సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా పయణమయ్యారు. శ్రీకాకుళం అర్‌డిఒ సాయిప్రత్యూష, డిఇఒ రవిబాబు, సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి ఎస్.శశిభూషణ్ సమీక్షించారు. జిల్లా నుంచి తీసుకువెళ్లి మళ్లీ బస్సుల్లో జిల్లాకు సజావుగా తీసుకొచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉత్సాహంగా నూతన ఉపాధ్యాయులు బస్సులో పయనమయ్యారు. ఉద్యోగ ధ్రువీకరణ పత్రం అందుకునే మధుర క్షణం కోసం నూతన ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించి ప్లేస్‌మెంట్ ఖరారు చేయనున్నారు.

బస్సు ఎక్కుతున్న నూతన ఉపాధ్యాయులు

బాల్య వివాహాలు నేరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అలాంటి వివాహాలు చేస్తే మత పెద్దలకు కూడా శిక్ష తప్పదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన సంస్థ కార్యాలయంలో బుధవారం ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మత పెద్దలు, ఫొటోగ్రాఫర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కొన్ని సామాజిక తరగతుల్లో ఇంకా బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అలాంటి వివాహాల వల్ల బాలికలు అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. గర్భధారణ సమయంలో తీవ్రమైన సమస్యలు తలెత్తవచ్చని, పుట్టబోయే శిశువులు కూడా ఆరోగ్య సమస్యలతో జన్మించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లలను చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచిస్తూ, బాల్య వివాహాల నివారణ కోసం ప్రభుత్వ పథకాలను వివరించారు. ఇలాంటి సమస్యలు ఎదురైతే 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయడం, స్థానిక జిల్లా కోర్టు భవనంలో గల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈ సదస్సులో కె.రమణ (ఐసిపిఎస్), న్యాయవాది జి.ఇందిరాప్రసాద్, చీఫ్ ఎల్ఎడిసి కె.ఆఫీసు నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతూ హరిబాబు

IN THE HONOURABLE COURT OF THE IVth ADDITIONAL DISTRICT JUDGE CUM SC & ST JUDGE AT SRIKAKULAM
I.A. /2025 IN A.S.No. 10/2025

Between:-
Gorle Anjeneyulu .....Appellant
And:-
Kanugula Hemambhara Rao .....Respondents

To,
R-2 :- Kanugula Tulasi Das, S/o. Late Venkatappadu, aged about 56 years, residing at Mandal Veedhi, Srikakulam Town and District.
R-3:- Kanugula Vasantha Kumari @ Laxmi, D/o. Late Venkatappadu, W/o Rammohan, aged about 55 years, residing at Mandal Veedhi, Srikakulam Town and District.
R-4:- Kanugula Rambabu, S/o. Late Venkatappadu, aged about 54 years, residing at Mandal Veedhi, Srikakulam Town and District.
R-5:- Kanugula Bharathi, D/o. Late Venkatappadu, W/o Appala Naidu, aged about 53 years, residing at Mandal Veedhi, Srikakulam Town and District.

NOTICE

Please take notice that the above matter stands posted on **24-10-2025** for your appearance before the court, therefore you are hereby directed to appear before the Honorable court on **24-10-2025 at 10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided in your absence.

P.V. RAMANA DAYAL
ADVOCATE,
SRIKAKULAM, CELL: 98491 71366.

అమృత్ నిధులు స్వాహా

ఎమ్మెల్యే రవికుమార్

మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో గత ప్రభుత్వం అమృత్ 2.0 పథకం ద్వారా మంజూరు చేసిన నిధులు అధికారులు స్వాహాతో దుర్వినియోగం జరిగాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం అసెంబ్లీలో ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ పథకం ద్వారా మున్సిపాలిటీలకు మంజూరు చేసిన నిధులను అధికారులు ఎక్కడా పనులు జరగకుండా కాంట్రాక్టర్లు ఖర్చులు చూపించి స్వాహా చేశారని ఆయన ఆరోపించారు. మాజీ సిఎం జగన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్, పులివెందుల కార్పొరేషన్, విశాఖపట్నం, రుషికొండ, విజయవాడ విమానాశ్రయంతో పాటు వివిధ ప్రాంతాల్లో సుమారు రూ.120 కోట్లు వరకు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరుతో నిధులు దుర్వినియోగం జరిగాయని ఆరోపించారు. దీనిపై మున్సిపల్ శాఖ మంత్రి తక్షణమే స్పందించి విచారణ చేపట్టడంతో పాటు అమృత్ 2.0 పథకం అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా జరిగిన అవినీతి లెక్కలపై విచారణ జరిపించి శాసనసభలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

రణస్థలం : జగన్‌తో మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో బుధవారం సమావేశం అనంతరం మర్యాద పూర్వకంగా ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ కలిసి పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా జగన్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై కిరణ్ కుమార్‌ను అడిగి పలు విషయాలను తెలుసుకున్నారు.

ఆమదాలవలస: జిల్లా వైసిపి అధికార ప్రతినిధి కోట గోవిందరావు వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలు, రాజకీయ పరిస్థితులపై జగన్ ఆరా తీసినట్లు కోట గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ఉన్నారు.

రేపు యూరియా కోసం ధర్నా

మాట్లాడుతున్న లోలాక్షి, కృష్ణారావు

ప్రజాశక్తి- కంచిలి

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు మండలానికి యూరియా అందించాలని కోరుతూ శాంతియుత ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, మాజీ ఎంపిపి ఇప్పిలి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం కంచిలిలో విలేకరులతో మాట్లాడారు. వర్షాలు అనుకూలంగా కావడం, నాట్లు అయ్యాక పంటలకు అవసరమైన సమయంలో కంచిలి మండల రైతాంగానికి యూరియా అధిక మొత్తంలో అవసరమైందన్నారు. ఆ ప్రాప్తికి ప్రభుత్వం యూరియా అందించడంలో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం మండలంలోని అన్ని పంచాయతీల్లో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకే ఈ శాంతియుత ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో యూరియా అందని రైతులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొని ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లేందుకు సహకరించాలని కోరారు.

మాట్లాడుతున్న అమరనాథ్

లే అవుట్ల క్రమబద్ధీకరణ తప్పనిసరి

కవిటి: లే అవుట్ల క్రమబద్ధీకరణ తప్పనిసరని సుడా ప్లానింగ్ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు కవిటి ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో బుధవారం ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుడా ప్లానింగ్ అధికారి డి.అమరనాథ్ మాట్లాడుతూ ఇళ్లకు, స్థలాలకు చట్టబద్ధమైన రక్షణ లభించాలంటే తప్పనిసరిగా లే అవుట్లు రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో ఇళ్ల నిర్మాణం, ఆస్తి రిజిస్ట్రేషన్, రుణాల విషయంలో ఎటువంటి ఆటంకాలు రాకుండా ఉండటానికి ఎల్ఆర్ఎస్ తప్పనిసరని స్పష్టంచేశారు. అలాగే గ్రామస్థాయిలో ప్రజలకు ఈ పథకం గురించి అధికారులు మరింతగా అవగాహన కల్పించాలని సూచించారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పి.మోహన్ మాట్లాడుతూ పథకం అమలు విధానం, నిబంధనలు, ప్రజలకు అందే లాభాలను వివరించారు. ప్రజలే ముందడుగు వేసి రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే భవిష్యత్‌లో ఆస్తులపై వివాదాలు తలెత్తే అవకాశం ఉండదని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ త్రినాథ్, డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్ పాల్గొన్నారు.

'విజ్ఞాన భారతి'లో బొమ్మల కొలువు

నరసన్నపేట: విజ్ఞాన భారతి పాఠశాలలో దసరా నవరాత్రుల సందర్భంగా బుధవారం బొమ్మలు కొలువు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీదేవి బొమ్మల కొలువుల పురాణ గాథలను తెలియజేశారు. కరస్పాండెంట్ డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ పిల్లలకు బొమ్మల కొలువువలన భారతదేశ సంప్రదాయాలు నైతికథ తెలుస్తుందని తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులు సూర్యనారాయణ పిల్లలకు దసరా గొప్పతనాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఢిల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు శైలజ, అరుణకుమారి, హేమకుమారి, అంజలి, అనురాధ పాల్గొన్నారు.

క్విజ్ పోటీలకు ఆహ్వానం

శ్రీకాకుళం సిటీ: వికసిత్ భారత్ యువ నాయకుల ప్రసంగ (క్విజ్) పోటీలకు నమోదు చేసుకోవాలని మేర యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థులు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైందన్నారు. దేశవ్యాప్తంగా 10 వేల మంది యువతను క్విజ్‌పోటీల ద్వారా ఎంపిక చేసి వారికి వివిధ స్థాయిల్లో బహుమతులు ప్రధానం చేయునున్నట్లు తెలిపారు. యువ నాయకుల ప్రసంగ (క్విజ్) పోటీల ద్వారా ఎంపికైన యువత ప్రధాని మోదీని నేరుగా కలుచుకునే అవకాశం లభిస్తుందన్నారు. www.MYBharat.gov.in,https://mybharat.gov.in నమోదు చేసుకోవాలని కోరారు. క్విజ్ పోటీల్లో ఎంపికైన వారికి ఎస్ఎ రైటింగ్ పోటీలు నిర్వహిస్తారని, అక్కడ విజేతలైన వారికి డిబేట్ ఉంటుందన్నారు .ఆన్‌లైన్ ప్రక్రియ అక్టోబరు 31 వరకు ఉంటుందన్నారు. 15 నుంచి 29 ఏళ్ల వయసు గల యువతీ, యువకులు అర్హులన్నారు.

ఆరోగ్య రక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకం

నేడు ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం

ప్రజాశక్తి- పలాస

ప్రపంచ ఆరోగ్య సంస్థ భాగస్వామ్యైన ఇంటర్నేషనల్ ఫార్మసిటికల్ ఫెడరేషన్ వ్యవస్థాపక దినోత్సవం 2009 సెప్టెంబరు 25న ఏటా ప్రపంచ ఫార్మాసిస్టు దినోత్సవంగా నిర్వహించుకుంటున్నారు. రోగికి ప్రాణం పోసి బతికించేది డాక్టర్లు అయితే... వారు వాడే మందులకు ప్రాణం పోసేది ఫార్మసిస్టులే. వీరి ఆవశ్యకత, ప్రస్తావం కరోనా, ప్లేగు వివిధ ప్రాణాంతక వ్యాధులు వచ్చేటప్పుడు మందులు తయారీ వ్యాక్సినేషన్ల అవసరం వచ్చినప్పుడు ఉంటుంది. ప్రాచీన, మధ్యయుగాల్లో ఆయుర్వేదం, యునాని, చైనీస్ గ్రీకు వైద్య విధానాల్లో మూలికలు, ఖనిజాలు, జంతు ఉత్పత్తులతో తయారు చేసి వాడేవారు. ఆధునిక ఫార్మసీ ఆవిర్భావం తరువాత ఫార్మసీ ప్రత్యేక శాస్త్రంగా అభివృద్ధి చెందింది. 1821లో పిల్పిడ్డియ కాలేజీ ఆఫ్ ఫార్మసీ మొట్టమొదటి ఫార్మసీ కాలేజీ నెలకొల్పారు. మన దేశంలో ఆధునిక వైద్య విధానం అలోపతి ప్రవేశించింది. భారతదేశంలో ప్రొఫెసర్ ఎం.ఎల్.షరీఫ్ ఫార్మసీ విద్యా వ్యవస్థ పితామహుడుగా పిలుస్తారు.

దేశంలో 1948లో ఫార్మసీ యాక్టు అమల్లోకి వచ్చిన తర్వాత ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థాపించారు. ఫార్మసీ విద్య నాణ్యత, నియంత్రణ ఫార్మాసిస్టుల రిజిస్ట్రేషన్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, నియంత్రణ అంశాలను చేర్చి రాష్ట్ర స్థాయిలో కూడా కౌన్సిల్ ఏర్పాటు చేసి తద్వారా ఆ రాష్ట్రాల్లో ఫార్మసీ రంగాన్ని బలోపేతం చేశారు. ఈ క్రమంలో విద్యార్థులు డిప్లమా ఇన్ ఫార్మసీ, బ్యాచిలర్ ఫార్మసీ, మాస్టర్ ఫార్మసీ ప్రవేశపెట్టారు. ఇటీవల కాలంలో విదేశాల్లో విద్య, ఉపాధి అవకాశాలకు డాక్టర్ ఆఫ్ ఫార్మసీ కోర్సుని ప్రవేశపెట్టి ఫార్మసీ రంగాన్ని బలోపేతం దిశగా ప్రభుత్వాలు పనిచేస్తూ ఉన్నాయి.

ఫార్మాసిస్టులు ప్రభుత్వ, ప్రైవేటు విభాగాలు పనిచేస్తూన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో, మెడికల్ షాపుల్లో మందులు ఇవ్వడమే కాదు. ఆస్పత్రుల్లో ఫార్మసీ కమ్యూనిటీ ఫార్మసీ, క్లినికల్ ఫార్మసీ, డ్రగ్ కంట్రోల్, రిసెర్చ్ వంటి విభాగాల్లో పనిచేస్తున్నారు. రోగి ,వైద్యుడు ,ఔషధం మధ్య వంతెనగా ఫార్మాసిస్టులు పనిచేస్తున్నారు. చిన్నపిల్లలు గర్భిణులకు, వృద్ధులకు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి మందులు ఇచ్చేటప్పుడు ప్రత్యేకమైన జాగ్రత్తలు పాటిస్తూ ఉంటారు. పరిశోధన, మందుల అభివృద్ధి ఫార్మసీరంగంలో విరివిగా రీసెర్చ్ నిర్వహిస్తున్నారు. క్షయ, పోలియో, లెప్రసీ భారతదేశంలో నిర్మూలించేందుకు ఫార్మాసిస్టు పాత్ర చాలా ఎక్కువగా ఉంది. కరోనా సమయంలో వ్యాక్సినేషన్, మందుల పంపిణీ సమయంలో కీలక పాత్ర పోషించారు. డాక్టర్లతో కలిసి రోగులకు మందులు ఎంత ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి అనేది నిర్ణయిస్తారు. వ్యాక్సినేషన్ సెంటర్లలో టీకాలు కూడా ఇస్తారు. పిస్క్రిప్షన్ లేని మందులు చీటీలను డాక్టర్ సంతకం లేనివి మందులు ఇవ్వకూడదు.

బలోపేతం చేయాలి

ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌లను బలోపేతం చేసి ఫార్మసిస్టు సమస్యలను వేగవంతంగా పరిష్కరించారు. నాణ్యమైన విద్య ప్రస్తుత వైద్య విద్యకు సరిపడే విధంగా ఫార్మసీ విద్యనూ ఆధునీకరించాలి. ఫార్మసీ విద్యను అభ్యసించిన నిరుద్యోగ ఫార్మసిస్టులకు ప్రభుత్వమే ఫార్మా కంపెనీలను స్థాపించాలి. మెడికల్ షాపులు నిర్వహించాలి.

- బోనెల గోపాల్, ఫార్మాసిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

పి4 సర్వే వేగవంతం

ఆమదాలవలస : మాట్లాడుతున్న కమిషనర్ రవి

ఆమదాలవలస: పి4 సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. బుధవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో పి4 సర్వేకు సంబంధించి సచివాలయ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి4 సర్వే యాప్‌లో కనిపించే లబ్ధిదారులను గుర్తించి ఇంటింటికి తిరిగి సర్వే చేసి, వారి పేదరిక స్థితిని నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన వారికి విద్య, వైద్యం, ఇతర సేవల ప్రయోజనాలు అందేలా నిబంధనల మేరకు సంబంధిత యాప్‌లో మ్యాపింగ్ చేయాలని సూచించారు. ప్రభుత్వ నిర్దేశాల మేరకు సర్వేను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ జాన్సన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

పలాస : ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 2047కు పేదరికం లేని రాష్ట్రంగా ప్రభుత్వం కృషి చేస్తుందని కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సచివాలయం కార్యదర్శులకు పి4పై శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో 989 బంగారు కుటుంబాలను సర్వే చేశామన్నారు. ఒక బంగారు కుటుంబానికి సుమారు ఐదుగురు మార్గదర్శకులను కూడా దత్తత తీసుకునే విధంగా ఆర్థిక, ఆర్థికేతర మార్గదర్శకులను గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

కంచిలి: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పి4 కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మండల ప్రత్యేకాధికారి కె.అప్పలస్వామి, ఎంపిడిఒ వి.తిరుమలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పి ఫోర్ కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో మండలంలోని విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి4 యాప్‌ను ఇన్స్టాల్ చేసుకునే విధానం, కేటాయించిన బంగారు కుటుంబాలను, మార్గదర్శకులను ఈ నెల 30లోగా అనుసంధానం చేయాలన్నారు. బంగారు కుటుంబాలకు ఆర్థికంగానే కాకుండా విద్య, వైద్య, మౌలిక సదుపాయాల పరంగా సహకారం అందించటమే ప్రధాన ఉద్దేశమన్నారు. ఎపిఒ ధనంజయ రావు, రిసోర్స్ పర్సన్లు వెంకటరావు, జగన్నాథ్ పాల్గొన్నారు.

పోష్టికాహారంపై వివరిస్తున్న సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి

పోష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

పోషక విలువలు కలిగిన పదార్థాలు తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.శ్రీలక్ష్మి అన్నారు. పైడిభీమవరం ప్రాజెక్ట్ పరిధిలోని నారువ వెల్నెస్ సెంటర్‌లో పోషన్ మహ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టిన, పుట్టబోయే బిడ్డలు మంచి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అందుబాటులో దొరికే పండ్లు, కూరగాయలు, ఇతర పోషక పదార్థాలు, వాటి ప్రాధాన్యం తెలిపారు. డాక్టర్ బి. అనూష, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, మరియమ్మ, శాంతమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎడిహెచ్ చంద్రశేఖర్

ఆ విహెచ్ఎ మాకొద్దు

కవిటి: మండలంలోని బి.జి.పుట్టుగ, బొరివంక సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న విహెచ్ఎ కె.రత్నకుమారి పనితీరు బాగోలేదని, ఏమాత్రం సమయపాలనలేదని, ఏ సమయానికి వస్తుందో ఎప్పుడు వెళ్తుందో కూడా తెలియదని ఎడిహెచ్ సిహెచ్.చంద్రశేఖర్, హెచ్ఒ మాధవీలతకు స్థానిక రైతులు ఫిర్యాదు చేశారు. గత కొద్ది నెలలుగా విహెచ్ఎ రత్నకుమారి పనితీరుపై అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కవిటిలో నిర్వహించి ఓ సమావేశంలో కూడా ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సదరు విహెచ్ఎ పనితీరు బాగోలేదని, వెంటనే ఆవిడని బదిలీ చేయాలని ఆదేశించారు. వెరసి ఎడిహెచ్ చంద్రశేఖర్ బుధవారం రైతులతో సమావేశమయ్యారు. రైతుల సమస్యలు విని సదరు విహెచ్ఎపై చర్యలు తీసుకుని మరొక విహెచ్ఎను నియమిస్తామని హామీ ఇచ్చారు. ఈ విచారణలో సర్పంచ్ శ్రీరామ్‌ప్రసాద్, ఎంపిటిసిలు దుద్ది సతీష్‌కుమార్, పిరియా కృష్ణారావు, రైతులు బల్లెడ మోహన రావు, బొడ్డ వేణుగోపాల్, బల్లెడ జయప్రకాష్ పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి

మందస: మండలంలోని హరిపురం జెడ్‌పి హైస్కూల్ ప్లస్ పాఠశాలలో 10,11,12 తరగతి చెందిన విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్, ఐటి ట్రేడ్స్‌పై బుధవారం శిక్షణ ఇచ్చారు. పది రోజుల పాటు ఇంటర్న్ షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో అవగాహన కల్పించారు. స్వయం ఉపాధి, వృత్తి నైపుణ్యం, ఫ్యూచర్‌పై శిక్షణ ఇచ్చారు.

జూన్ నాటికి టిడ్కో ఇళ్లు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ రామారావు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కోసంగిపురం వద్ద నిర్మిస్తున్న టిట్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి 2026 జూన్ కల్లా లబ్ధిదారులకు అందజేస్తామని కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు. బుధవారం అంగీకారం 2025 కార్యక్రమంలో భాగంగా పిఎంఎవై 2.0 ప్రధానమంత్రి ఆవాస్ యోజన కార్యక్రమంపై అంగీకార పోస్టర్లతో మహిళా సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం కింద ప్రభుత్వం రూ.1,50,000లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేస్తుందని తెలిపారు. అలాగే పట్టణాల్లో 2 సెంట్లు భూమి గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు భూమి మంజూరు చేశామన్నారు. స్థానికంగా స్థలం లభ్యం కాకపోతే ప్రభుత్వం వారే స్థలాలను కొని ఇస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ఇళ్లు లేని పట్టణ పేద ప్రజలు అందరూ వినియోగించుకోవాలని కోరారు. గతంలో టిడ్కో ఇళ్ల మంజూరైన లబ్ధిదారులకు జూన్ 2026 నాటికి పూర్తి చేసి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ సిఎల్‌టిసి సిహెచ్. మల్లేశ్వరరావు, ఎపి టిడ్కో సిఎల్‌టిసి జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు సహించం

మాట్లాడుతున్న శ్యామలరావు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎచ్చెర్ల నియోజకవర్గం అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌తోనే సాధ్యమని, అభివృద్ధిని చూసి ఓర్వలేక అభివృద్ధి కోసం మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ తప్పుడు మాట్లాడుతున్నారని కూటమి నాయకులు ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం టిడిపి రణస్థలం మండల అధ్యక్షులు లంక శ్యామలరావు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన ఐదేళ్ల పదవీ కాలంలో అసెంబ్లీ అనే దేవాలయంలో ఎప్పుడైనా నియోజకవర్గ సమస్యలపై గొంతు విప్పారా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే హయాంలో గ్రావెల్ కొండల దోపిడీ, అక్రమ తవ్వకాల ద్వారా వనరుల ధ్వంసం జరిగిందని, కొండములగాం కొండపై పరిమితులకు మించి తవ్వకాలకు రూ.5 కోట్ల జరిమానా విధించబడిన విషయం కూడా ప్రజలకు తెలుసన్నారు. సంచాం కొండపై జికె ఇన్‌ఫ్రా పేరుతో లైసెన్స్ పొందడం కూడా మాజీ ఎమ్మెల్యే బినామీ వ్యవహారమని ఆరోపించారు. ప్రస్తుతం యువత కోసం ఎన్‌పిసిఐఎల్ సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్మిస్తున్న క్రమంలో కొండను చదును చేసి, ఆ మట్టిని రణస్థలం ఫ్లైఓవర్ నిర్మాణానికి వినియోగించడం ప్రజల మేలు కోసం జరుగుతుంటే దానిని వనరుల ధ్వంసం అంటున్న మాజీ ఎమ్మెల్యే మాటలు కేవలం అక్కసు మాత్రమే నన్నారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు పిన్నింటి వెంకట బానోజీనాయుడు, మాజీ సర్పంచ్ పిసిని జగన్నాథంనాయుడు, లుకలాపు అప్పల నాయుడు, మహంతి అనంత్, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము, రౌతు శ్రీనివాసరావు, మండపాక కనకరావు, నారాయణశెట్టి శ్రీనివాసరావు తదితరులున్నారు.

శ్రీనివాసులురెడ్డిని కలిసిన ఎమ్మెల్యే

కొత్తూరు : సన్మానిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- కొత్తూరు

ఎపి రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఉత్తరాంధ్ర టిడిపి జోన్ వన్ ఇన్‌ఛార్జీ పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం కలిశారు. విజయవాడ ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈయన వెంట వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, బి.సంజీవరావు ఉన్నారు.

లావేరు : పుష్పగుచ్ఛం అందజేస్తున్న సురేష్ తదితరులు

లావేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వేతన సలహా బోర్డు చైర్మన్‌గా బుధవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేసిన ఉత్తరాంధ్ర టిడిపి జోన్-1 ఇన్‌ఛార్జి పెళ్లకూర శ్రీనువాసులు రెడ్డికి లావేరు టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్ ప్రమాణస్వీకార శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువ, పుష్ప గుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జి.సిగడాం టిడిపి మండల అధ్యక్షుడు కుమారాపు రవి కుమార్, బుడతవలస ఎంపిటిసి ముల్లు సాయికుమార్, మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనువాసరావు తదితరులున్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

శ్రీకాకుళం సిటీ : విద్యార్థినులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రక్తదానం ప్రాణదానమని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరావు అన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద గల కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహనరావు, జిల్లా వైద్యాధికారి అనితతో కలిసి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ అన్ని దానాల్లో రక్తదానం మిన్న అని, రక్తదాన ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. జిల్లాలో రక్తం కొరత ఎక్కువగా ఉందని, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచనల మేరకు, ప్రతీ కళాశాలలో రక్తదాన శిబిరాలను నిర్వహించి, రక్తం కొరత లేకుండా సేకరిస్తున్నట్లు చెప్పారు. కళాశాల డైరెక్టర్ బిఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివ శంకర్ సహకారం అందజేశారు. ఈ రక్తదానంలో పాల్గొని రక్తదానం చేసిన డా.బి.ఆర్.అంబెద్కర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కళ్లేపల్లి ఉదయ్ కిరణ్‌లకు జ్ఞాపికను, బంగారు పతకాన్ని అందించి, దుశ్శాలువాలతో సత్కరించారు.

ఎచ్చెర్ల: జాతీయ సేవా పథకం 57వ దినోత్సవాన్ని డా. బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కేంద్ర విద్యా, యువజన శాఖ మాజీ మంత్రి, ఎయు పూర్వ అధ్యాపకులు ఆచార్య వి.కె.ఆర్.వి.రావు జయంతోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్.ఎస్.ఎస్. అధికారి డా. ఎం.సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా భావం, సామాజిక బాధ్యత, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అందించేది ఎన్.ఎస్.ఎస్. మాత్రమే అని అన్నారు. కార్యక్రమంలో, వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, నెహ్రూ యువ కేంద్ర ఉప సంచాలకులు కె.వెంకట ఉజ్వల్, బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం. ప్రసాదరావు, ఎన్.ఎస్.ఎస్. జిల్లా కోఆర్డినేటర్ డా. డి.వనజ, వర్శిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు డా. ఎం.అనురాధ, డా. సిహెచ్. రాజశేఖరరావు పాల్గొన్నారు.

అలాగే రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డేలో స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డా.ఎం.సుధాకర్ పాల్గొన్నారు. గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి బాలాజీ, పెద్దింటి ముకుంధరావు, ఎఒ ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, సుధాకర్, గేదెల రవి, వి.సింహాచలం, బి.శ్రీధర్, పి.గాయిత్రి, డా.పి.ప్రశాంత్ కుమార్, టి.అసిరినాయుడు, ఆర్.పద్మావతి, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని నైరా ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో అసోసియేట్ డీన్ డా. జి.జోగి నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కవిటి: కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యాన ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ ఆరంగి మధు, ఆరంగి త్రివిక్రమ్‌రావు, బెందాళం తిరుమలరావు, వజ్జ రంగారావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.విశ్వనాథం పాల్గొన్నారు.

నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవంలో ప్రిన్సిపాల్ పి.లత, వైస్ ప్రిన్సిపాల్ హేమశాంతి, అధ్యాపకులు అన్నాజీరావు, త్రినాథరావు, పవిత్ర పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆశా కార్యకర్త మృతి

బృందావతి మృతదేహం

మెళియాపుట్టి : మండలంలోని చాపర పిహెచ్‌లో పనిచేస్తున్న చాపరకు చెందిన ఎస్. బృందావతి (51) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. పిహెచ్‌సి వైద్యులు పావని, మండలానికి చెందిన ఆశా కార్యకర్తల సంఘం సభ్యులు కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తక్షణ సహాయం కింద రూ.10వేలు అందించారు. తన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఏదైనా సహాయం కోసం తమవంతుగా కృషి చేస్తామన్నారు. ఆశాలు స్వర్ణలత, సుజాత, లక్ష్మీ, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఏడురోడ్ల కూడలిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వికలాంగురాలు జానీ గాయ పడింది. రోడ్డుపై దేకురుకుంటూ వెళుతుండగా, కారు ఢీ కొట్టింది. గాయపడ్డ మహిళను శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి జైలు శిక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నిషేధిత గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన బుడుమూరు నాగరాజు అనే వ్యక్తిపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ కోర్టు శిక్ష విధించిందని ఎస్‌పి కె.వి మహేశ్వ రరెడ్డి ప్రకటన ద్వారా తెలియజేశారు. అక్రమంగా నిషేధిత గంజాయి 2023 జనవరి 3న టెక్కలి గ్రామ పరిధిలో జగదిమెట్ట జంక్షన్ జాతీయ రహదారి సర్వీస్‌రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడు నాగరాజు స్కూటీలో గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. ఒడిశా రాష్ట్రం చీకటి గ్రామ పరిధిలో గుర్తు తెలియని అటవీ ప్రాంత రైతుల వద్ద 5 కేజీలు కొనుగోలు చేసినట్టు గుర్తించినట్లు చెప్పారు. టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసునమోదు చేసినట్లు చెప్పారు. గంజాయి విలువ రూ.27, 500గా చెప్పారు.

వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలోని ఎఒ రామారావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బకాయి పడిన ఏరియాస్, రేషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని కోరారు. డోర్ టు డోర్ సర్వీసెస్ రద్దు చేసి ఉద్యోగస్తులకు సహకరించాలని కోరారు. అలానే పారదర్శక బదిలీలు, అన్ని డిపార్ట్‌మెంట్లకు జాబ్‌చాట్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సచివాలయం ఉద్యోగుల కో-ఆర్డినేటర్ పొల్లయి అశోక్, సళ్ల ప్రవీణ్, జోగమ్మ, ఉమా, పందిరి రమేష్, శేషారావు, శారద పాడి, నిర్మల, ఉప్పిలి జయమ్మ, కె.కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తతో వాగ్వివాదానికి దిగిన సిఐ

ఉత్సవాల్లో పోలీసుల అత్యుత్సాహం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కొత్తమ్మతల్లి ఉత్సవాలకు వచ్చిన బందోబస్తుకు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రజాప్రతినిధులను ఆలయం లోపలకు విడిచి పెట్టాలని స్వయాన ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్ కోరాడ గోవింద్ ఆలయ ముఖద్వారం వద్ద ఉన్న సిఐ, పోలీసులు కోరగా, వారు నిరాకరించారు. 'నేను ఆలయ చైర్మన్‌ను అని చెప్పినా... నువ్వు ఎవ్వరివైనా మాకేంటి... మీ వద్ద విఐపి పాస్ ఉంటేనే ఈ ద్వారం గుండా విడిచిపెడతామని, మాకు మా పై అధికారులు అలానే చెప్పారని' సిఐ దురుసుగా సమాధానం చెప్పారు. దీంతో చేసేందిలేక ఆయన నిరాశగా వెనుతిరిగారు. అలాగే వాహనాలను ఆలయానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంచాలని ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. ఈ ఏడాది 800లకు పైగా పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేయడంతో అత్యుత్సాహం ప్రదర్శించారని యాత్రికులు వాపోతున్నారు.

ఒక్కొక్క హామీ అమలు

వంశీకృష్ణ చౌదరి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలతో కూటమి ప్రభుత్వం దూసుకుపోతుందని జనసేన వజ్రపుకొత్తూరు క్లస్టర్ ఇన్‌ఛార్జి దువ్వాడ వంశీకృష్ణచౌదరి అన్నారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. మొదటి సంతకంలో భాగంగా మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ వేసి గురువారం నూతన ఉపాధ్యాయులను నియామక పత్రాలు గురు వారం విజయవాడలో అందజేస్తున్నారని అన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ గ్రామీణా భివృద్ధి శాఖ ద్వారా నియోజకవర్గంలోని రోడ్లకు మహర్దశ వచ్చింద న్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష నియోజకవర్గంలోని సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తూ మంచి ఫలితం రాబెడుతున్నారని చెప్పారు. వంశధార నీరు రెండేళ్ళుగా సకాలంలో అందుతుందని తెలిపారు.

దసరా పద్యాల్లో చీరల విశిష్టత

మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి

లావేరు: దసరా ఉత్సవాల సందర్భంగా లావేరు శాఖా గ్రంథాలయంలో బుధవారం దసరా పద్యాల్లో మహిళలు కట్టుకునే చీరల పద్యం పిల్లలతో వల్లి వేయించి చీరల విశిష్టతపై గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు తెలిపారు. కంచి చీర, ఉప్పాడ చీర, చేనేత చీరలను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం దసరా ఏ విధంగా జరుపుకుంటారో వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులు

నృత్యం... ప్రతి నిత్యం

ప్రజాశక్తి- కవిటీ

శాస్త్రీయ సంగీతపై అవగాహన కలిగి, చిన్న వయసు నుంచే నృత్యం అలవాటైతే ఆ చిన్నారుల మానసిక స్థితితో పాటు శారీరక ఆరోగ్యం ఎంతో మెరుగవుతుందని నాట్య గురువు శృతి పట్నాయక్, కపాసుకుద్ది ఉప సర్పంచ్ పి.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ముత్యాలపేటలో ఉన్న అమృతవర్షిణి సహితశ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ (ఇచ్ఛాపురం) ఆధ్వర్యాన గతేడాదిగా చిన్నారులకు నాట్య శిక్షణ అందిస్తున్నారు. నాట్య గురువు శృతి పట్నాయక్, చిన్న గురుస్వామి మార్గదర్శకత్వంలో, శిక్షకులు నీలాపు శైలు, చాట్ల విజయలక్ష్మి శిక్షణ కొనసాగించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు 11 మంది చిన్నారులకు బుధవారం గజ్జల పూజను చిన్నగురు స్వామి చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.సంజన, బి.దీక్షిత, చి.పూజ, డి.పవిత్ర, బి.నేహా, వి.హని, డి.శరణ్య, డి.శ్రీజణ్య, ఆర్.శ్రీవల్లి, పి.సునంద, పి.రక్షితలకు గజ్జలు కట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

సమతా సైనికదళ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- నరసన్నపేట

బడుగు, బలహీన, అనగారిన వర్గాల హక్కులు రక్షించడానికి అనిచి వేతకు వ్యతిరేకంగా పోరాడటానికి బాబా సాహెబ్ అంబేద్కర్ సమతా సైనికదళ్ సంఘం స్థాపించారని ఆంధ్రప్రదేశ్ విద్యా సంక్షేమం, మౌలిక వసతులు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పి.ఎం.జి.బాబు అన్నారు. స్థానిక బండి వీధిలో బుధవారం సమతా సైనిక దల్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ దేశంలోని 143 కోట్ల ప్రజలకు స్వాతంత్ర్య ఫలాలు అందించడానికి అనిశిత కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సమతా సైనికదల్ సంఘం జిల్లా అధ్యక్షులు చల్లా రామారావు, బొచ్చ విష్ణుకుమార్, దువ్వారి రాజకుమార్, నాగేశ్వరరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న జగన్నాథరావు

మాజీ ఎంపిపి పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని సిలగాం సింగువలసకు చెందిన కుంచాల సూరమ్మ అనారోగ్య కారణంతో బాధపడుతున్నారని తెలుసుకొని వారి కుటుంబాన్ని మాజీ ఎంపిపి జి. జగన్నాథరావు బుధవారం పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రావాడ భూలోకం కాలు విరిగిందని తెలుసుకొని వారి కుటుంబాన్ని, నేతింటి సుందరరావు అనారోగ్య కారణంగా మరణించారని వారి కుటుంబాన్ని, గుజ్జుల కిస్తీ అనారోగ్య కారణంగా మరణించారని, కుంచాల ఆదినారాయణ అనారోగ్య కారణంగా మరణించారని వారి కుటుంబాన్ని, బట్నవానిపేటలో నక్క పాపయ్య అనారోగ్య కారణంగా మరణించారని కుటుంబాలను పరామర్శించారు. అలికాం గ్రామంలో బైరి రాములమ్మ అనారోగ్య కారణంగా మరణించారని వారి కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు ఉన్నారు.

ప్రేక్షకులకు చేరువైన కన్యాకుమారి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న చిత్ర దర్శకుడు సృజన్ కుమార్, యూనిట్ సభ్యులు

జిల్లాకు చెందిన అట్టాడ సృజన్‌కుమార్ దర్శక, నిర్మాణంలో రూపొందిన కన్యాకుమారి చలనచిత్రం ప్రేక్షకులకు దగ్గరయినట్లు దర్శకులు వెల్లడించారు. చిత్ర యూనిట్ నగరంలోని వరం రెసిడెన్సిలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. శ్రీ చరణ్, గీత్ సాయి నటించగా సృజన్‌కుమార్ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ చిన్న సినిమా ఈ రోజుల్లో థియేటర్‌లో ఆడటం కష్టంగా మారిందన్నారు. ఒక రైతు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావాలన్నా యువతి ప్రేమ ఇతివృత్తాంతంగా సినిమా తీశామన్నారు.. థియేటర్లలో అనుకున్న విజయం సాధించలేదని నిరాశ చెందానన్నారు.

ఒటిటి ప్లాట్ ఫామ్‌లో అమెజాన్ ప్రైమ్, ఆహాలో ప్రస్తుతం కన్యాకుమారి స్ట్రీమింగ్ అవుతుందని, టాప్ టెన్‌లో ట్రెండింగ్ మూవీగా నిలిచిందన్నారు. థియేటర్లలో ఫ్లాప్, ఒటిటిలో సూపర్ హిట్ అన్న సోషల్ మీడియా ట్రోలింగ్ తమకు ఊపిరి పీల్చిలా చేసిందన్నారు. కన్యాకుమారి సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. పుష్పక విమానం తన మొదటి సినిమా అని, భవిష్యత్‌లో ఉత్తమ సినిమాలు నిర్మించి, దర్శకత్వం చేయటం లక్ష్యంగా చెప్పారు. జిల్లా నుంచి ఒక ఉత్తమ దర్శకుడిగా ఎదిగే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కథానాయక గీత్ సాయిని, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, మామిడి క్రాంతి, గొంటి గిరిధర్ చిత్రనటులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నగరమే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కాలుష్య రహిత సంచులు పంపిణీ చేస్తున్న అధికారులు

నగరపాలక సంస్థ పరిధిలో దేవాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామని నగరపాలక సంస్థ కమిషనర్ డి.వి.డి.ప్రసాదరావు తెలిపారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని హర్షవల్లి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం ప్రతినిధుల నేతృత్వాన స్థానిక విజయ గణపతి ఆలయంలో బుధవారం చేపట్టారు. పట్టణం పచ్చదనాలతో నిండి హరితహారం కావాలని జిల్లా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఎన్విరాన్మెంట్ ఛైర్మన్ పొన్నాడ రవి కుమార్ ఆకాంక్షించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న గృహాల్లో పచ్చదనాలు పెంపొందించే గృహస్తులకు సిక్కోలు హరిత మిత్ర పేరుతో ప్రతి ఏడాది జనవరిలో ఐదువేల నగదు పురస్కారాన్ని తమ సంస్థ తరపున అందించనున్నామని, జనవరి 10లోగా తెలియజేస్తే, 12న విజేతలను ప్రకటిస్తామని తెలిపారు. పట్టణంలో శాంతినగర్ కాలనీ, హడ్కో కాలనీలో కొలువున్న దేవాలయాల్లో హర్షవల్లి లయన్స్ క్లబ్ తరఫున ప్లాస్టిక్ నిరోధక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తామని క్లబ్ ప్రతినిధులు తెలియజేశారు. హెల్త్ ఆఫీసర్ సుధీర్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు లయన్ డాక్టర్ పైడి సింధూర, సెక్రటరీ టెక్కం రాంగోపాల్, ఉపాధ్యక్షులు బి.ఉమ, పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఆలయ ధర్మకర్తల మండలి

కొత్తమ్మతల్లి సందర్శన

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి ఆలయాన్ని టెక్కలి, నరసన్నపేట జనసేన నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు కణితి కిరణ్ కుమార్, బలగ ప్రవీణ్ మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. వీరికి ఆలయ ధర్మకరల మండలి చైర్మన్ కోరాడ గోవింద్, సభ్యులు పూజలు నిర్వహించారు. అలాగే జిల్లా జనసేన నాయకులు పల్లి కోటేశ్వరరావు, పాగోటి అనిత్ తదితరులు ఉన్నారు. అలాగే ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి తల్లిదండ్రులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రాదాయం ప్రకారం పూజలు నిర్వహించారు.

మహిళ అస్వస్థత

కొత్తమ్మతలి దర్శిణానికి వచ్చిన ఓ మహిళ ఉక్కపోతతో అస్వస్థతకు గురై కళ్లు తిరిగి పడిపోయింది. వెంటనే సమీపంలో ఉన్న వైద్య శిబిరంలో ఉన్న డాక్టర్ వరుణ్ అమెకు వెంటనే ప్రథమ చికిత్స అందించారు. అయినా అ మహిళ స్పృహలోకి రాకపోవడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : మండలంలోని గాజుల కొల్లివలస సబ్‌స్టేషన్ పరిధిలో గల వివిధ గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డిఎస్‌ఎస్ వర్క్స్ ద్వారా నూతన ఫీడర్ల ఏర్పాటు, చెట్ల కొమ్మలు తొలగించుటకు, విద్యుత్ లైన్ల నిర్వహణ కొరకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. గాజుల కొల్లివలస, చిన్న జొన్నవలస, మునగవలస, అక్కులపేట, రామచంద్రపురం, పొన్నాంపేట, చిట్టివలస, సైలాడ, ధన్నాన పేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. ఈ అంతరాయాన్ని విద్యుత్ వినియోగ దారులు గ్రహించాలని సూచించారు.

విద్యార్థికి అభినందనలు

నరసన్నపేట : ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు శ్రీజ్ఞాన జ్యోతి స్కూల్ విద్యార్థి తాన్ని ఉమాశంకర్ అండర్-16 షార్ట్ పుట్ బాలుర విభాగానికి ఎంపికయ్యారు. ఈయనకు బుధవారం స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులు వెలమల భాస్కరరావు, బోర రామారావు, పాగోటి లక్ష్మి, తర్ర సత్యనారాయణ, పిఇటి పల్లి రాజులు అభినందించారు.

అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

మహిళలకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్య రక్షణకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ సాహితీ ప్రియదర్శిని ఆధ్వర్యంలో బుధవారం షళంత్రిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన చైర్మన్ సూర్యనారాయణ మాట్లాడుతూ స్వస్తినారి సశక్త్ పరివార అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం మహిళలకు ఎస్‌సిడి స్కానింగ్, కేన్సర్ స్క్రీనింగ్, గర్భిణీ సంరక్షణ వంటి వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని మహిళలు అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ మోహనరావు, సూపర్‌వైజర్ మోహనరావు, వైద్య సిబ్బంది మహాలక్ష్మి, ప్రియాంక, అశ్విని, రుక్మిణి, అనూష, సర్పంచ్ బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మాకివలస పిహెచ్‌సి వైద్యులు శిరీష, విజయకుమార్ సూచించారు. నరసన్నపేట ఒకటో సచివాలయం పరిధిలో స్వస్త్ నారీ స్త్రీ శక్తి పరివార్ అబియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అలాగే కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం రక్తపోటు, మధుమేహం, కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయం కేన్సర్‌పై వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, మాజీ సర్పంచ్ జి.చిట్టిబాబు, ఎఎన్‌ఎం మీనాక్షి, విజయలక్ష్మి, ఝాన్సీరాణి, సీతామాలక్ష్మి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలో ఈదుపురంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సర్పంచ్ నర్తు వరప్రసాద్, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, మెడికల్ ఆఫీసర్ వెచ్చా సంతోష్ పర్యవేక్షణలో ఉచిత వైద్య సేవలు అందించారు. గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి వివేకానంద రెడ్డి, యూత్ లీడర్ హంగర్ బెహరా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఒ నరసింహమూర్తి

బారువలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బారువలో ఎఒ నరసింహమూర్తి ఆధ్వర్యాన బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సోంపేట సహా వ్యవసాయ సంచాలకులు భవానీశంకరరావు పాల్గొని రైతులకు సమగ్ర ఎరువులు యాజమాన్యం, సమగ్ర పురుగుల యాజమాన్యం, ఈ పంటలపై అవగాహన కల్పించారు. మితిమీరి నత్రజని ఎరువు వాడకం వల్ల అనర్థాలు వివరించి వరికి రాబోయే చిరు పొట్టు దశలో పొటాష వాడకంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం సోంపేట, కొర్లాంలోని ప్రైవేట్ షాపుల వద్ద పొటాష్ లభ్యత ఉందని తెలియజేశారు. ప్రస్తుత వాతావరణంలో పొడ తెగులు, ఆకుముడత ఆశించే ప్రమాదం ఉన్న యూరియా వాడకం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, వ్యవసాయ సహాయకులు శంకర్, మౌనిక పాల్గొన్నారు. అనంతరం వారు సోంపేట యూరియా పంపిణీ నిర్వహిస్తున్న ప్రైవేటు దుకాణాన్ని పరిశీలించి భౌతిక నిల్వ నివేదికలు స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

ప్రజాశక్తి- పలాస

అవగాహనతోనే ఎయిడ్‌ను నియంత్రించవచ్చునని, అసురక్షిత లైంగిక సంబంధాలకు దూరంగా ఉండాలని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తమ్మినేని పాపినాయుడు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆస్పత్రి ఆవరణలో ఎల్‌ఇడి తెరపై హెచ్‌ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరూ తమ హెచ్‌ఐవి స్థితిని తెలుసుకోవాలని, తద్వారా హెచ్‌ఐవి వ్యాప్తిని అరికట్టవచ్చని అన్నారు. గర్భిణులు తప్పని సరిగా హెచ్‌ఐవి పరీక్షలు చేపించుకోవాలన్నారు. ఐసిటిసి కౌన్సిలర్ బగాది శ్రీకాంత్ నిర్వహించిన కార్యక్రమంలో హెడ్ నర్స్ ఉమామహేశ్వరి, టెక్నీషియన్లు శివ ప్రసాద్, ఢిల్లీరావు, శోభారాణి, టిబి సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్స్ ఉదయ్ కుమార్,భాస్కర్, ఫిజియో థెరపిస్టు మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ పాపినాయుడు

బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

పలాస : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలాస ప్రభుత్వా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అన్నారు. డిగ్రీ కళాశాలలో నూతన విద్యార్థులకు బుధవారం స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించే విద్యా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు కనువిందుగా మారాయి.

సన్మానిస్తున్న గ్రామస్తులు

మీ సేవలు స్ఫూర్తి

వజ్రపుకొత్తూరు: ఉద్యోగులు వారు అందించే సేవలుతోనే ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని సర్పంచ్ మువ్వల పూర్ణచంద్రరావు అన్నారు. మండలంలోని నువ్వులరేవు సచివాలయంలో సేవలందించి బదిలీపై వెళ్లిన వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వసంత, గ్రామ రెవెన్యూ అధికారి అరుణను బుధవారం సచివాలయ ఆవరణలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను గ్రామ పెద్దలు కొనియాడారు. ఎక్కడ పని చేసినా మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. టిడిపి యూనిట్ కన్వీనర్ కదంబాల వెంకటరమణ, చొంప మ్మ, కార్యదర్శి ఉష, విఆర్ఒ తులసి పాల్గొన్నారు.

సేవాభావం అవసరం

శ్రీకాకుళం సిటీ: ప్రభుత్వ మహిళ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో బుధవారం 'ఆయుర్వేద దినోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ .చిన్నారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదం అనేది అతి ప్రాచీన వైద్య విధానం అని దానిని పరిరక్షించుకోవాలని అన్నారు. మాకవలస పిహెచ్‌సి ఆయుర్వేద వైద్యులు డాక్టర్ వెలమల సీతాలక్ష్మి మాట్లాడుతూ స్త్రీలలో ఉండే సమస్యలకు ఆయుర్వేద వైద్య విధానం ఉపయోగ పడుతుందన్నారు.